క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగ పోటీలకు తిరుమల విద్యార్థిని



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ మంగళవారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన యోగ పోటీలో కళాశాల విదార్థిని పి. ఏసుమరియమ్మ ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 21వ తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో ఏసుమరియమ్మ పాల్గొంటారని వివరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన ఏసుమరియమ్మను ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ, యోగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రంగలక్ష్మీ, అధ్యాపకులు అభినందించారు.

ఉమ్మడివరం వైఎస్సార్ సీపీ రథసారథిగా ఆచార్యులు



వినుకొండ: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కమిటీని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు చెన్నయ్య ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పార్టీ ప్రెసిడెంట్‌గా కాయకోకుల ఆచారులు (ముసలయ్య)ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ సూరాబత్తిని రాజేశ్వరరావు, మండల స్థాయి నాయకులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

వినుకొండ: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డిపో మేనేజర్ జె.నాగేశ్వరరావు తెలిపారు. 8వ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఏడాది గడిచి ఉండాలని కోరారు. సంస్థ నిబంధన ప్రకారం డ్రైవింగ్ చేసిన ఎడల వారికి ప్రతి దినము రూ.800లు జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225431 నంబరును సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: కుమార్తె అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ మంగళవారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన పి. శారదకు చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన ఆంజనేయులుతో వివాహం అయ్యింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో పెద్దల సమక్షంలో మాట్లాడుకొని విడిగా ఉంటున్నారు. శారద తండ్రి శ్రీను వద్ద ఉంటుంది. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

24.2 ఎం.ఎం వర్షపాతం

రొంపిచర్ల: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి 24.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. వర్షం కారణంగా పొలాల్లో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. బురద వరి నారుమళ్లు సాగు చేస్తున్న రైతులకు మంగళవారం కొద్ది మేర వాతవరణం పొడిగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. నారుమళ్లలో పల్లాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమయ్యారు. యధావిధిగా నారుమళ్లలో విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని కూడా సాగించారు.

ఫైబ్రో స్కాన్ బ్రోచర్ ఆవిష్కరణ



రొంపిచర్ల: హాస్పిటల్స్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించటం అభినందనీయమని తహసీల్దార్ బి. నిర్మల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉచిత ఫైబ్రో స్కాన్ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉచిత ఫైబ్రో స్కాన్ బ్రోచర్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బసవ గ్యాస్ట్రో అండ్ లివర్ ఇనిస్ట్యూట్ నిర్వాహకులు వేమూరి శ్రీనివాసరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు



పట్టణంలోని సీడీపీవో ఆఫీస్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి జీబీ మొబైల్స్ పనిచేయనందున బాలసంజీవిని పోషణ ట్రాకర్ ఎఫ్ఆర్ఎస్ యాప్స్‌లలో పనిచేయడానికి వీలు పడటం లేదని, వీటిని వెనక్కి ఇవ్వడం జరిగిందని తెలిపారు. వెంటనే 5జీబీ మొబైల్స్ ఇస్తూ తక్షణమే రూ.26 వేలు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. టీచర్లకు మెయిన్ టీచర్లగా గుర్తించాలని, మెనూలో మార్పులు చేర్పులు చేయాలని, బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు శారమ్మ, అంగన్‌వాడీలు పద్మ, శివపార్వతి, కనకమ్మ, ప్రసన్నకుమారి, షకీలా తదితరులు పాల్గొన్నారు. - వినుకొండ

భారం తగ్గించరూ..

విప్పర్ల, సంతగుడిపాడు, రెడ్డిపాలెం, రొంపిచర్ల క్లస్టర్‌ల పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులతో యూటీఎఫ్ నాయకులు మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం. మోహన్ రావు మాట్లాడుతూ విద్యాశాఖలో యాప్‌ల భారం తగ్గించాలని, పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని, డీఏలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్యంగా పోరాటాలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉద్యమాలకు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్. లింగారావు, ఎం. రామాంజనేయులు, కె. రవి, కార్మెన్ మీరీ, టి. అనూష, ఏపీ మోడల్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధి హేమలత, లక్ష్మీ నరసింహ, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. - రొంపిచర్ల



ప్రకృతి వ్యవసాయమే మేలు



ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రాజెక్ట్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఇండో–జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ ఆధ్వర్యంలో రైతు శాస్త్రవేత్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కె.అమలకుమారి పాల్గొని రైతు శాస్త్రవేత్తలు అనుసరిస్తున్న నూతన వ్యవసాయ పద్ధతులు ద్వారా అధిక ఆదాయం పొందుతున్న విజయగాధలను అడిగి తెలుసుకున్నారు. వరి, పత్తి, కంది పంటలు పండించే రైతులు ప్రకృతి వ్యవసాయ మెలకువలు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో డీపీపీ భవానిరాజు, శ్రీనివాస్, విజయలక్ష్మి, స్రవంతి పాల్గొన్నారు. - నరసరావుపేట రూరల్

ఉత్తమ సొసైటీగా నూజెండ్ల ప్రాథమిక సంఘం



నూజెండ్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉత్తమ సొసైటీగా నూజెండ్ల ఎంపికైనట్లు సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన ఆప్కాబ్ 62వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదగా ఈ అవార్డు అందుకోవటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బచ్చు అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ సొసైటీగా గుర్తింపు రావటం అనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

దవాఖానాకు దయలేదు!

రెక్కలు ముక్కలు చేసి కుటుంబాన్ని పోషించే యజమాని జీవితంలోకి అనుకోని కష్టం రోడ్డు ప్రమాదం రూపంలో ఎదురైతే.. అక్కున చేర్చుకుని మేమున్నామని ధైర్యమివ్వాల్సిన ప్రభుత్వాస్పత్రులు దయలేని దవాఖానాలుగా మారుతున్నాయి. కాలు విరిగిందయ్యా.. కాపాడండి అని కన్నీళ్లతో వేడుకుంటే.. కాసులిస్తేనే కట్టుకడతామంటూ కఠినంగా వ్యవహరిస్తున్నాయి. కుటుంబ పెద్ద కాలు విరిగితే.. ఆ కుటుంబ జీవనస్థితి కుంటుపడుతుందనే కనీస దయ కూడా లేకుండా కాఠిన్యం చూపుతున్నాయి. నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో వైద్యం.. దైన్యంగా మారి కనికరించండయ్యా అంటూ రోగుల కన్నీళ్లు వేడుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే....

- రోడ్డు ప్రమాదంలో పెట్లూరివారిపాలెం వాసికి గాయాలు
- విరిగిన కాలుతో నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చేరిక
- నాలుగు రోజులుగా అందని వైద్యం
- కాసులిస్తేనే కాలుకు కట్టుకట్టేది
- కాలు ఇన్ఫెక్షన్ కావడంతో బంధువుల ఆందోళన



ఏరియా వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యాన్ని నిలదీస్తున్న బాధితుడి బంధువులు

నరసరావుపేట టౌన్: జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పేదలకు వైద్యం అందక నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగిన వ్యక్తికి వైద్య సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగి బంధువులు మంగళవారం ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఈ సంఘటన కూటమి ప్రభుత్వం వైద్య సేవలలో అవలంభిస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేలా ఉంది. పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన జెట్టి ప్రభాకర్ ఈనెల 1వ తేదీ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చిన మరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ప్రభాకర్ కాలు విరిగిందని ధ్రువీకరించారు. దెబ్బ తగిలిన భాగంలో మూడు కుట్లు వేసి నొప్పులు తగ్గడానికి మాత్రలు, ఇంజక్షన్ రాసిచ్చారు. ప్రతిరోజు డ్రెస్సింగ్ చేయాలని సిబ్బందికి డాక్టర్ సూచించారు. ఆ తరువాత రోగిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.





ఇన్ఫెక్షన్ కారణంగా వాచిన జెట్టిప్రభాకర్ మణికట్టు, విరిగిన కాలు

బంధువుల ఆగ్రహం

ప్రభాకర్ కాలు, చెయ్యి ఇన్ఫెక్షన్ వచ్చి వాపురావటంతో బంధువులు మంగళవారం ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల, సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. శుక్రవారం ఆసుపత్రిలో జాయిన్ అయిన బాధితుడికి విరిగిన కాలుకు సోమవారం పిండికట్టు వేయమంటే ఎందుకు వేయలేదు అంటూ నిలదీశారు. మీ నిర్లక్ష్యం వల్ల ఇన్ఫెక్షన్ ఎక్కువై కాలు దెబ్బతింటే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు.

ఫిర్యాదు చేస్తే విచారిస్తా

విషయం ఇప్పుడే తెలిసింది. వివరాలు అడిగి తెలుసుకుంటా. సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతిపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– డా.సురేష్, సూపరింటెండెంట్

పట్టించుకోని సిబ్బంది



వైద్యశాలలో చేరినప్పటి నుంచి సిబ్బంది పట్టించుకోలేదు. కనీసం డ్రెస్సింగ్ చేయలేదు. విరిగిన కాలుతో నొప్పిని భరిస్తూ నరకయాతన అనుభవించా. నడవలేని స్థితిలో ఉన్న నాకు వీల్ చైర్ సౌకర్యం కల్పించకుండా డాక్టర్ వద్దకు నడిచే వెళ్లమన్నారు. జాయిన్ అయిన రోజు కుట్లు వేసే సమయంలో సిబ్బంది నాతో రూ.200 డిమాండ్ చేసి తీసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్యం చేయాల్సి ఉండగా సిబ్బంది అవినీతికి పాల్పడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. – జెట్టి ప్రభాకర్, బాధితుడు

అన్ని వర్గాలను మోసగించిన ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: అన్ని వర్గాలను మోసగించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 19వ వార్డులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎలా మోసపోయింది తెలుసుకుంటున్నారని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పాలన అందిన విషయం ఇప్పుడు ప్రజలు మననం చేసుకుంటున్నారని వెల్లడించారు. ఎవరిని కలిసినా పెన్షన్లు రావడం లేదు... అమ్మ ఒడి రావడం లేదు అని వాపోతున్నారని తెలిపారు. జగనన్న పాలనలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారని ప్రస్తుతం పచ్చచొక్కా వేసుకుంటేనే పింఛన్ ఇస్తామంటూ వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పఠాన్ తలహాఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ పెద్ద షబ్బీర్, సయ్యద్ మస్తాన్‌వలి, సయ్యద్ అలి, ఖాజావలి, పఠాన్ బాజి, షేక్ కరిముల్లా, షేక్ బడేమియా, షేక్ సమీర్, షేక్ నాగూర్‌వలి, ఎం.వెంకటేశ్వర్లు, షేక్ మీరాబి, షేక్ ఆరిఫ్, పఠాన్ అబ్దుల్ రహమాన్, సాపా సైదావలి, మైలా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- కూటమి హామీలపై కన్నెర్ర
- వామపక్ష నేతల డిమాండ్
- వేర్వేరు ప్రాంతాల్లో నిరసనలు, వినతులు



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు

నరసరావుపేట ఈస్ట్: అధిక విద్యుత్ ఛార్జీలకు అవకాశం కల్పిస్తున్న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి అడ్డగోలుగా చార్జీలను పెంచిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని పిలుపు నిచ్చిన తెలుగుదేశం నాయకులు నేడు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లుకు అనుమతివ్వటం ప్రజలను దగా చేయటమేనన్నారు. సీఎం చంద్రబాబుకు విద్యుత్ ఉద్యమం రుచి తెలుసునని, వెంటనే స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోకపోతే తీవ్రస్థాయి ఉద్యమాన్ని ఎదుర్కొవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎస్‌కె సిలార్, డి.శివకుమారి, సత్యనారాయణరాజు, షేక్.జిలానీ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఎత్తివేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని తదితర డిమాండ్‌లతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గతంలో వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారని సీపీఎం నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు అన్నారు. ర్యాలీ చెరువుగట్టు సెంటర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలకోటయ్య, వీరయ్య, మరియబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇండ్లకు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించంకోవాలని, ఇప్పటికే వ్యాపార సంస్థలకు బిగించిన స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని, వివిధ పేర్లతో విధిస్తున్న విద్యుత్ సుంకాలను రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సీపీఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన ఏటువంటి ఇబ్బంది ఉండదని మాయమాటలు చెప్పి బలవంతంగా బిగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి చర్యలను విడనాడాలని, స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లుతో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఎంసీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్ భాష, సీపీఐఎంఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లిపాయల నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి శివకుమారి, సయ్యద్ రబ్బాని పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దే వద్దని అఖిల పక్ష ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు చెప్పారు. అఖిల పక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో సమావేశం నిర్వహించి, ర్యాలీగా వెళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్ట సవరణలతో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు తగ్గి, అదాని వంటి ప్రైవేటు వ్యక్తులకు నియంత్రణ పెరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధా కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, తాళ్లూరి బాబురావు పాల్గొన్నారు.

విద్యుత్ భారం మోయలేం!

వినుకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాన్ని, స్మార్ట్ మీటర్ల బిగింపు, పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు మాట్లాడుతూ పేదలపై మోపుతున్న విద్యుత్ భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, నాగేశ్వరరావు, సుబ్బారావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

- ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి
- ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బి సర్టిఫికెట్లు అందచేత



కేబీఆర్ కళాశాలలో క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో మానసిక, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవరుచుకునేందుకు ఎన్‌సీసీ దోహద పడుతుందని 23 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి తెలిపారు. కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ బి సర్టిఫికెట్ పరీక్ష ఉత్తీర్ణులైన సందర్భంగా మంగళవారం కళాశాలలో క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న కల్నల్ గోపాల్ త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్పష్టం చేసారు. విద్యా, ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు తెలిపారు. కాగా, కళాశాలకు చెందిన 28 మంది క్యాడెట్స్ పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి. నాగిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ వై.అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ బెటాలియన్ ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ పరమార్, కళాశాల పాలక వర్గ ప్రతినిధి కె.వి.పురుషోత్తమ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ తదితరులు పాల్గొన్నారు. బి.సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభినందించారు. అలాగే శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు బి.సర్టిఫికెట్ పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బిఎస్ఆర్‌కె రాజు తెలిపారు. విద్యార్థులకు బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి సర్టిఫికెట్లు అందచేశారు.

బాల్ బాడ్మింటన్ టీంకు కృష్ణవేణి విద్యార్థిని



నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరుజిల్లా బాల్ బాడ్మింటన్ మహిళా జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.కావ్య ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు మంగళవారం తెలిపారు. బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఎన్జీఓ క్లబ్‌లో ఈనెల 3వతేదీన నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో కావ్య జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ప్రకాశం జిల్లా చేవూరులో ఈనెల 29వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో కావ్య ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో ప్రభుత్వం విఫలం

చిలకలూరిపేట: గిరిజనులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ నేపథ్యంలో ఈ నెల 9న గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన దినోత్సవానికి ఆయా జిల్లాలకు అరకొర నిధులు కేటాయించి తూతూ మంత్రంగా నిర్వహించరాదని వెల్లడించారు.

■ విద్యుత్ సరఫరా బంద్

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు/నాదెండ్ల: ఇరు మండలాల్లోని ఆరు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చిలకలూరిపేట విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. చిలకలూరిపేట రూరల్ మండలంలోని వేలూరు ఫీడర్ కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా వేలూరు, కుక్కపల్లివారిపాలెం, పంగులూరివారిపాలెం, అలాగే యడ్లపాడు మండలంలోని సందేపూడి, తుర్లపాడు, గణేషనివారిపాలెం గ్రామాలకు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే గణపవరం గ్రామంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌సరఫరా నిలిపివేయబడుతుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. వేలూరు డొంక, తిమ్మాపురం డొంక, ముట్వావారివీధి, సినిమాహాల్ రోడ్డు, హైవేకు ఇరువైపులా సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

■ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: లోక్‌అదాలత్ ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె నరేంద్రరెడ్డి తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

■ ఆశావర్కర్లదే కీలక పాత్ర

చిలకలూరిపేటటౌన్: హెచ్ఐవీ నియంత్రణ, నివారణకు ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించాలని ఐసీటీసీ కౌన్సిలర్ కె హనుమంతరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని భావనరుషి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దిశా (డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ హేమంత్, టీబీహెచ్‌వీ లావణ్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

■ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి

నాదెండ్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు ఆగష్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందించారు. కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, షేక్ బాజి, నాయకులు దాదాసాహెబ్, షేక్ మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు.